పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

- కోడ్ ఉల్లంఘిస్తే.. ఎవరినీ వదలం
- నిబంధనల మేరకే నామినేషన్ల దాఖలు
- అభ్యర్థులు నేరచరిత్రను వెల్లడించాల్సిందే
- పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాలకు పెద్దపీట
- 'సాక్షి'తో కరీంనగర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో మహేశ్వర్

Interview



కరీంనగర్ అర్బన్:

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు చేపడుతున్నాం. నామినేషన్ పత్రాల దాఖలు, పోలింగ్, ఓట్ల లెక్కింపు తదితర అంశాల్లో నిశితంగా పరిశీలిస్తాం. శుక్రవారంతో నామినేషన్ల దాఖలు పూర్తవుతుందని కరీంనగర్ నియోజకవర్గ ఎన్నికల అధికారి, ఆర్డీవో కుందారపు మహేశ్వర్ అన్నారు. 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో పలు అంశాలు వెల్లడించారు.

సాక్షి: ఎన్నికల సంఘం అభ్యర్థుల నేరచరిత్రను వెల్లడించాలని స్పష్టం చేసిన క్రమంలో ఎలాంటి చర్యలు చేపట్టారు?

ఆర్వో: ఇప్పటికే రాజకీయ పార్టీల ప్రతినిధులతో పలుమార్లు సమావేశం నిర్వహించాం. సీ నమూనాలో అభ్యర్థుల కేసుల వివరాలు వెల్లడించాలి. ఏదైన దినపత్రిక, టీవీ న్యూస్ ఛానల్‌లో మూడు సార్లు సదరు వివరాలను ప్రకటన ఇవ్వాలి.

సాక్షి: మహిళా, యువ, దివ్యాంగుల పోలింగ్ కేంద్రాలను గుర్తించారా? భద్రతాపరంగా ఎలాంటి చర్యలు చేపట్టారు?

ఆర్వో: నియోజకవర్గంలో మొత్తం 390 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఓటర్ల సంఖ్య పెరగడంతో అదనంగా పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశాం. గతంలో 346 ఉండగా ఇప్పుడు 390కి చేరింది. మహిళలే సిబ్బందిగా మహిళా పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తున్నాం. యువ పోలింగ్ కేంద్రాలతో దివ్యాంగుల కేంద్రాన్ని గుర్తిస్తున్నాం. భద్రతాపరంగా ప్రతీ పోలింగ్ కేంద్రంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. వెబ్‌కాస్టింగ్ జరుగనుంది.

సాక్షి: ఈసారి అన్ని యాప్‌ల ద్వారానే ప్రక్రియ చేపడుతున్నారు కదా.. అనుమతులకు దరఖాస్తులు, ఫిర్యాదులకు వేదికగా మలిచారు.. పార్టీల నుంచి స్పందన ఉందా?

ఆర్వో: సువిధ యాప్ ద్వారా ప్రచార సభలు, ర్యాలీలు, వాహనాల శ్రేణి తదితర వాటికి అనుమతిస్తున్నాం. సభలకు 48 గంటల ముందు దరఖాస్తు చేయాలి. ఇప్పటికే దరఖాస్తులు మొదలయ్యాయి. వాటిని పరిశీలిస్తున్నాం. కోడ్ ఉల్లంఘనపై ఫిర్యాదు చేసేందుకు సీ విజిల్ యాప్ ఉపయోగపడుతోంది. పౌరులకు పూర్తి అవగాహన ఏర్పడగా ఫిర్యాదులు చేస్తున్నారు. చర్యలు చేపడుతున్నాం.

సాక్షి: డబ్బు, మద్యం, ప్రలోభాలను నియంత్రించేందుకు తీసుకుంటున్న చర్యలు?

ఆర్వో: ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు, స్టాటికల్ సర్వైలెన్ టీంలను ఏర్పాటు చేశాం. ఇప్పటివరకు రూ.3కోట్ల నగదు పట్టుకున్నాం. సరైన ఆధారాలను చూపిస్తే జిల్లాస్థాయి గ్రీవెన్స్ కమిటీ విడుదల చేస్తోంది. రూ.10లక్షలకు మించి నగదు పట్టుబడితే ఆదాయపు పన్ను శాఖ పరిశీలిస్తోంది.

సాక్షి: పోలింగ్ కేంద్రాల్లో సమస్యలున్నాయని గతంలో ఎన్నికల్లో సిబ్బంది అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

ఆర్వో: కొన్ని కేంద్రాల్లో అసౌకర్యాలు గుర్తించి సరిచేస్తున్నాం. ప్రైవేట్ విద్యాలయాల్లో ర్యాంపులు లేనిచోట నిర్మించాలని ఆదేశించాం. తాగునీరు, కరెంట్, వెలుతురు వంటి సౌకర్యాలను గమనించి పోలింగ్ కేంద్రాలుగా గుర్తించాం.

సాక్షి: ఎన్నికల సంఘం దివ్యాంగులు, 80ఏళ్లు దాటిన వారికి ఇంటి నుంచే ఓటు వేసే సౌకర్యం కల్పించింది. వారిని గుర్తించారా?

ఆర్వో: 80 ఏళ్లు దాటిన వృద్ధులు, దివ్యాంగులు ఇంటి నుంచే ఓటు వేసేలా చర్యలు చేపడుతున్నాం. అచేతన స్థితిలో ఉన్నవారిని గుర్తించి వారి వద్దకే మొబైల్ వాహనంలో ఈవీఎం తీసుకెళ్లి ఓటు వేయిస్తాం. సదరు ప్రక్రియ తుది దశలో ఉంది.

సాక్షి: పోలింగ్ పెంచేందుకు తీసుకుంటున్న చర్యలు?

ఆర్వో: నగరంలో పోలింగ్ శాతం పెంచేందుకు ఇప్పటికే ఈవీఎం ప్రచార వాహనాలతో ఓటర్లకు అవగాహన కల్పించాం. తక్కువ పోలింగ్ నమోదైన కేంద్రాల్లో కళాజాత బృందాల ద్వారా ముఖ్య కూడళ్లలో ప్రచారం చేస్తున్నారు. డిగ్రీ కాలేజీలు, మహిళా సంఘాల సభ్యులకు ఓటు ప్రాముఖ్యతను వివరించాం. ఈసారి పోలింగ్ శాతం పెరిగేలా వీలైనన్ని మార్గాల్లో అవగాహన కల్పిస్తున్నాం.

సాక్షి: ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఎలా అమలు చేయనున్నారు?

ఆర్వో: నామినేషన్ల దాఖలులో వాహనాల శ్రేణితో ఆర్భాటం చేస్తామంటే కుదరదు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి ప్రకారం మాత్రమే అనుమతిస్తాం. కోడ్ ఉల్లంఘన చేస్తే కేసు నమోదు చేస్తాం.

రోడ్డుపై ధాన్యంతో ప్రమాదాలు

చిత్ర కథ



కరీంనగర్‌రూరల్: రైతులు ధాన్యం ఆరబెట్టేందుకు కల్లాలు లేకపోవడంతో రోడ్లపైనే ఆరబోసుకుంటున్నారు. ప్రభుత్వం ఉపాధిహామీ పథకం ద్వారా కల్లాల నిర్మాణానికి నిధులు మంజూరు చేసినప్పటికీ రైతులు స్థలాలు అందుబాటులో లేకపోవడంతో ముందుకు రాలేదు. అధికారులు సైతం అవగాహన కల్పించ లేదు. వానాకాలం సీజన్ వరికోతలు ముమ్మరం కావడంతో పలువురు రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తరలిస్తున్నారు. కరీంనగర్ మండలం చామనపల్లి, ఇరుకుల్లలోని కేంద్రాల్లో స్థలం సరిపోకపోవడంతో కొందరు రైతులు రోడ్డుపైనే ధాన్యం ఆరబెడుతున్నారు. గతంలో చామనపల్లిలో రాత్రివేళల్లో ద్విచక్రవాహనదారులు ధాన్యం కుప్పలతో ప్రమాదాలకు గురైన ఘటనలున్నాయి. అధికారులు రైతులకు ప్రత్యామ్నాయ స్థలాలను చూపించి ధాన్యం ఆరబోసుకునేందుకు చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

క్లుప్తంగా

వైశ్య సేవా కేంద్రం కార్యవర్గానికి సన్మానం



కార్యవర్గాన్ని సన్మానిస్తున్న కొండయ్య

కరీంనగర్‌కల్చరల్: వైశ్య సేవా కేంద్రం నూతన కార్యవర్గాన్ని గురువారం సాయినగర్ సాయిబాబా ఆలయంలో అన్నదాన కమిటీ చైర్మన్ చిట్టుమల్ల కొండయ్య సన్మానించారు. ఈ కార్యక్రమంలో సాయిబాబా ఆలయ చైర్మన్ ప్రకాశ్ పటేల్, సభ్యులు నలుమాచు చంద్రశేఖర్, రామిడి శ్రీధర్, ముప్పు సత్యం, విశ్వనాథుల శ్రీనివాస్, డైరెక్టర్లు సిరిపురం సురేందర్, బొల్లం శ్రీనివాస్, సుభాష్, పోకల లక్ష్మీనారాయణ, కొమురవెల్లి వెంకటేశం, కృష్ణకిశోర్, నార్ల శ్రీనివాస్, ఎల్గూరి రవి, మల్లేశం, మునీందర్, చంద్రశేఖర్, శ్రీధర్, ఆలయ సిబ్బంది గుడికాడి శ్రీనివాస్, పిట్టల అంజయ్య పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి ఉషు పోటీలకు ఎంపిక



కరీంనగర్‌స్పోర్ట్స్: మహబూబ్‌నగర్‌లో శుక్రవారం నుంచి జరుగనున్న రాష్ట్రస్థాయి ఉషు పోటీలకు నగరంలోని రెసోనెన్స్ కళాశాల విద్యార్థులు ఎంపికైనట్లు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. ఇటీవల ఉమ్మడి జిల్లా పాఠశాల క్రీడా సమాఖ్య ఆధ్వర్యంలో ఫండస్ స్కూల్‌లో జరిగిన ఉషు పోటీల్లో విద్యార్థులు శ్రీవర్షితరెడ్డి, టి.హాసిని, నయనిత, అజితేస్, తవాబ్, ఖుషీల్, బిలాల్ హుస్సేన్ ఎంపికయ్యారన్నారు.ఎంపికైన విద్యార్థులను కళాశాల చైర్మన్ అంజిరెడ్డి, ప్రిన్సిపాల్ సుదర్శన్, అధ్యాపకులు, విద్యార్థులు అభినందించారు.

ఓటు హక్కును వినియోగించుకోండి



పారిశుధ్య కార్మికులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న నగర పాలక సంస్థ కమిషనర్ శ్రీనివాస్

కరీంనగర్‌కార్పొరేషన్: ఈనెల 30వ తేదీన జరిగే ఎన్నికల్లో తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని నగరపాలక సంస్థ కమిషనర్ బోనగిరి శ్రీనివాస్ అన్నారు. నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో గురువారం ఓటు ప్రాధాన్యతపై పారిశుధ్య కార్మికులకు అవగాహన కల్పించారు. 10, 11, 12, 33, 51 డివిజన్‌ల పరిధిలో విధులు నిర్వహించే పారిశుధ్య కార్మికులకు భగత్‌నగర్‌లోని భగత్‌సింగ్ చౌరస్తాలో ఓటు వినియోగంపై ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పలు సలహాలు, సూచనలు చేశారు. అనంతరం పారిశుధ్య కార్మికులతో ఓటు హక్కు వినియోగిస్తామని ప్రతిజ్ఞ చేయించారు. 1950 టోల్ ఫ్రీ నంబర్, సీవిజిల్ యాప్ వినియోగాన్ని వివరించారు. ఓటు వేయడంతో పాటు చుట్టు ప్రక్కల వారి ని కూడా ఓటు వేసేలా చైతన్యపర్చాలని కోరారు. ఎన్నికల్లో ఎలాంటి ప్రలోభాలకు లొంగకుండా నిజా యితీగా తమ ఓటు హక్కును వివియోగించుకుంటేనే మనం వేసే ఓటుకు విలువ అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ నరేశ్‌బాబు, నోడల్ అధికారి బి.రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలు తలెత్తకుండా పర్యవేక్షించాలి



మాట్లాడుతున్న ఎస్ఈ గంగాధర్

కొత్తపల్లి: క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యలు తలెత్తకుండా నిరంతరం పర్యవేక్షించాలని సిబ్బందికి టీఎస్ఎన్‌పీడీసీఎల్ కరీంనగర్ సర్కిల్ ఎస్ఈ వడ్లకొండ గంగాధర్ సూచించారు. కరీంనగర్ సర్కిల్ కార్యాలయ ఆవరణలోని సమావేశ మందిరంలో గురువారం రాత్రి నిర్వహించిన కరీంనగర్ టౌన్, రూరల్ సబ్ డివిజన్ల వోఅండ్ఎం సిబ్బంది సమీక్షా సమావేశంలో విద్యుత్ అంశాలపై మాట్లాడారు. క్షేత్రస్థాయిలో విద్యుత్ సమస్యను గుర్తిస్తే బ్రేక్‌డౌన్లను నివారించవచ్చునన్నారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గులు లేకుండా చూసుకోవాలన్నారు. అదే విధంగా వినియోగదారులకు మెరుగైన విద్యుత్ సరఫరా చేస్తూనే రెవెన్యూపై దృష్టి సారించాలని అన్నారు. డీఈ రాజం, ఏడీఈ కొలుపుల రాజు, ఏవో అరవింద్, ఏఈలు, వోఅండ్ఎం సిబ్బంది పాల్గొన్నారు.

ముందస్తు దీపావళి వేడుకలు





సప్తగిరికాలనీ(కరీంనగర్),: కరీంనగర్‌లోని సిద్దార్థ విద్యాసంస్థల్లో గురువారం ముందస్తు దీపావళి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణాన్ని అందంగా మామిడి తోరణాలు, దీపాలతో అలకరించి ధనలక్ష్మీ దేవి పూజ జరిపారు. సిద్దార్థ విద్యాసంస్థల డైరెక్టర్ దాసరి శ్రీపాల్‌రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించగా.. పలువురు విద్యార్థులు అష్టలక్ష్మీ దేవి వేషధారణలతో హాజరై ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అనంతరం విద్యార్థులు పటాకులు కాలుస్తూ సంబురంగా పాల్గొన్నారు.

మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఫాతిమారెడ్డి

కొత్తపల్లి: న్యూఢిల్లీకి చెందిన ఐఎంవో ఇంటర్నేషనల్ మ్యాథ్స్ ఒలింపియాడ్ ఫౌండేషన్ నిర్వహించిన గణిత పరీక్షల్లో రేకుర్తిలోని ప్యారడైజ్ పారడైజ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చి రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించినట్లు ఆ పాఠశాల చైర్మన్ పోతిరెడ్డి ఫాతిమారెడ్డి తెలిపారు. పాఠశాలలో గురువారం నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు పి.అక్షిత, పి.శివాని, హెచ్.శ్రీజ, జి.లాస్య, బి.మేఘనలను అభినందించారు. అకాడమిక్ సీఈవో ఉమాకాంత్, ప్రిన్సిపాల్ టి.వసంత, వైస్ ప్రిన్సిపాల్ ఏ.మధు, ఏవో కె.శ్రీనివాసరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మద్యం పట్టివేత



పట్టుకున్న బైక్, మద్యం సీసాలు

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో గురువారం ద్విచక్రవాహనంపై అక్రమంగా మద్యం తరలిస్తున్న కల్లెపల్లి సుధాకర్‌ను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఎన్నికల కోడ్ నిబంధనలకు విరుద్ధంగా అక్రమంగా తరలిస్తున్న సుధాకర్‌ను రెండు కాటన్ల బీర్లతో పాటు ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని ఎక్సైజ్‌స్టేషన్‌కు తరలించారు. ఎక్సైజ్ డీసీ ఆదేశాల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని రూరల్ సీఐ తిరుమల లత తెలిపారు. ఎస్సైలు స్వప్న, సింధు, అశోక్, క్రిష్ధర్, స్వప్న, శ్రీలత, రమాదేవి, రమ్య పాల్గొన్నారు.

టీచర్ల ఆర్థికసాయం

శంకరపట్నం: మండలంలోని మొలంగూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పీఈటీ జ్యోతి, తెలుగు టీచర్ ఆదిలక్ష్మిలు పాఠశాల అభివృద్ధికి రూ.5వేల చొప్పున ఆర్థికసాయం చేశారు. గురువారం హెచ్ఎంకు నగదు అందించారు.

కరీంనగర్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌ను తనిఖీ చేసిన సీపీ



సిబ్బందితో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మహంతి

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌రూరల్ పోలీస్‌స్టేషన్‌ను సీపీ అభిషేక్ మహంతి గురువారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. పలు రికార్డులను పరిశీలించి సమస్యాత్మక, సున్నితమైన పోలింగ్ కేంద్రాల వివరాలు తెలుసుకున్నారు. పోలీస్‌స్టేషన్‌లోని సిబ్బందికి పలు సూచనలు చేశారు. గత ఎన్నికల సమయంలో గొడవలు చేసిన, అల్లర్లు సృష్టించి, ప్రజలను భయభ్రాంతులకు గురిచేసి, ఓటర్లను ప్రభావితం చేసే వ్యక్తులపై పటిష్ట నిఘా ఏర్పాటు చేయాలని అన్నారు. వారిని సంబంధిత అధికారుల ఎదుట బైండోవర్ చేయాలని, ఉల్లంఘిస్తే బౌండ్ డౌన్ చేసి పూచీకత్తు సొమ్ము మొత్తాన్ని జప్తు చేయాల్సి వస్తుందని, జైలు శిక్ష కూడా విధించబడుతుందని వారికి తెలపాలని సూచించారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున విధుల్లో అప్రమత్తంగా ఉండాలని, అలసత్వం ప్రదర్శిస్తే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. క్షేత్రస్థాయిలో ఎన్నికల నియమావళిని రాజకీయ పార్టీలకు, వ్యక్తులకు అతీతంగా నిష్పక్షపాతంగా పక్కాగా అమలు పరచాలన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ రూరల్ ఇన్‌స్పెక్టర్ ప్రదీప్‌కుమార్, ఎస్సై రాజు, సిబ్బంది పాల్గొన్నారు.

సమాజ మార్పునకు ఓటు హక్కు కీలకం



మాట్లాడుతున్న ఈశక్

సప్తగిరికాలనీ(కరీంనగర్): సమాజ మార్పునకు ఓటు హక్కు అత్యంత కీలకం అని భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నగర ఉపాధ్యక్షుడు ఎలకటురి ఈశక్ అన్నారు. గురువారం నగరంలో జరిగిన ఎస్సారార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల కమిటీ సమావేశంలో మాట్లాడారు. ఓటు హక్కు వినియోగించుకోవడం అందరి బాధ్యత అని అన్నారు. దేశ అభివృద్ధి కోసం ఓటు హక్కు భారత రాజ్యాంగంలో అందించారని తెలిపారు. ఒక మంచి నాయకుడిని ఎన్నుకోవడం అందరి బాధ్యత అని, అందరూ ఓటు హక్కు వినియోగించుకోవాలని సూచించారు. విద్యార్థి నాయకులు శివమణి, విష్ణు, పవన్, అభిలాష్, సాయికిరణ్, నీరజ్, గిరిచరన్, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

విశ్వరూప మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

చిగురుమామిడి: హైదరాబాద్‌లో 11న నిర్వహించనున్న మాదిగ, ఉపకులాల విశ్వరూప మహాసభను విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా నాయకుడు ఖాత మల్లయ్య కోరారు. గురువారం చిగురుమామిడి బస్టాండ్ ఆవరణలో మహాసభ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మల్లయ్య మాట్లాడారు. ఎస్సీ రిజర్వేషన్లు, వర్గీకరణ, చట్టబద్ధత కల్పించాలని కోరుతూ మహాసభ ఏర్పాటు చేశామని, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహాసభకు ప్రధాని నరేంద్రమోదీ ముఖ్యఅతిథిగా హాజరుకానున్నారని చెప్పారు. మండలంలోని 17 గ్రామాలకు చెందిన నాయకులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్‌చార్జి బెజ్జంకి అంజయ్య, తదితరులు పాల్గొన్నారు.

1098పై అవగాహన



అవగాహన కల్పిస్తున్న కోఆర్డినేటర్ సంపత్

రామడుగు: మండలంలోని వన్నారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 నంబరుపై అవగాహన కల్పించారు. ఈసందర్భంగా చైల్డ్ హెల్ప్‌లైన్ నంబరు జిల్లా కోఆర్డినేటర్ సంపత్ మాట్లాడారు. విద్యార్థులు ఆపదలో 1098 నంబరుకు ఫోన్ చేయాలని సూచించారు. స్మార్ట్ ఫోన్ వల్ల నష్టాలను వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ లక్ష్మీరాజం, నరేంద్ర, సాయికిరణ్, మహేశ్, చరణ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దీర్ఘకాలిక రోగులకు 'యునాని'

- అల్లోపతికి దీటుగా అందుతున్న సేవలు
- మొండి వ్యాధులకు మెరుగైన చికిత్స
- అందుబాటులో అవసరమైన మందులు
- ప్రతిరోజూ 80పైగా ఔట్ పేషెంట్లు



ప్రభుత్వాసుపత్రిలోని యునాని విభాగం



పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

కరీంనగర్‌టౌన్: మారుతున్న జీవనశైలికి అనుగుణంగా ప్రజలు మార్పును కోరుకుంటున్నారు. సైడ్ ఎఫెక్ట్‌లు లేని మందులు వాడుతూ రోగాలు నయం చేసుకునేందుకు మొగ్గుచూపుతున్నారు. ఏళ్ల తరబడి మందులు వాడాల్సి వచ్చే దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసుకునేందుకు యునాని సేవలు వినియోగించుకుంటున్నారు. అలోపతికి లొంగని రోగాలను సైతం యునాని నయం చేస్తుందనే నమ్మకం రోగుల్లో పెరుగుతోంది. కీళ్లనొప్పులు, మోకాళ్ల నొప్పులు, నడుం నొప్పులు, ఆర్థరైటిస్, సైనసైటిస్ షుగర్, బీపీ, థైరాయిడ్, కిడ్నీలో రాళ్లు, ఆస్తమా, మలబద్ధకం, అర్షమొలలు, సోరియాసిస్, బొల్లి వంటి చర్మవ్యాధులకు ఆయుష్‌లో చికిత్స అందుబాటులో ఉంది. రోగం నయం చేయడంలో కాస్త ఆలస్యమైనా ఖచ్చితంగా ఫలితం ఉంటుందనే నమ్మకమే యునాని సేవలు పెరగడానికి కారణంగా తెలుస్తోంది. అల్లోపతికి దీటుగా సేవలు అందుతుండడంతో యునానికి డిమాండ్ పెరిగింది. దీంతో ప్రతీరోజు 80కి పైగా ఔట్‌పేషెంట్లు ఆసుపత్రికి వచ్చి చికిత్స పొందుతున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలుపుతున్నాయి.

ఆయుష్ నుంచి జనరల్ ఆసుపత్రిలోకి..

ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో కొనసాగుతున్న యునాని ఆసుపత్రిని 2019 జూలై 29న రాంనగర్‌లో నిర్మించిన ఆయుష్ నూతన భవనంలోకి మార్చారు. ఆయుష్ ఆసుపత్రిలో మూడు విభాగాల వైద్యం లభించేది. ఆయుర్వేదం, యునాని, హోమియోపతి వైద్యాన్ని కలిపి ఆయుష్‌గా పరిగణిస్తారు. మూడు విభాగాలు వేర్వేరుగానే సేవలందిస్తున్నాయి. అయితే యునానికి ఎక్కువగా డిమాండ్ ఉండడం, రాంనగర్‌లో ఉన్న ఆసుపత్రికి వెళ్లిరావడం ఇబ్బందిగా మారడంతో పేషెంట్ల కోరిక మేరకు ఆరు నెలల క్రితం తిరిగి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి మార్చారు. యునానిలో మెరుగైన వైద్యంతో పాటు మందులు అందుబాటులో ఉన్నాయి. తెలంగాణ రోగనిర్ధారణ కేంద్రాన్ని అనుసంధానం చేయడంతో రోగ నిర్ధారణ పరీక్షలకు సైతం ఇబ్బంది లేకుండా పోయింది.


సద్వినియోగం చేసుకోవాలి



యునాని వైద్యం పొందేందుకు పేషెంట్లు ఎక్కువగా వస్తున్నారు. అల్లోపతికి లొంగని వ్యాధులు సైతం నయం అవుతుండడంతో రోగులకు నమ్మకం పెరిగింది. ప్రతీరోజు 70 నుంచి 80 మంది రోగులు చికిత్స పొందేందుకు ఆసుపత్రికి వస్తున్నారు. టీ-హబ్‌తో ల్యాబ్ సేవలు సైతం అందుబాటులోకి వచ్చాయి. ప్రజలు యునాని వైద్యాన్ని సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ యస్రబ్ సుల్తానా, యునాని వైద్యురాలు

కాలుష్యం తగ్గించేందుకు సహకరించాలి



ప్రమిదలు పంపిణీ చేస్తున్న శాంతికుమార్

చొప్పదండి: పట్టణంలో కాలుష్యం తగ్గించేందుకు ప్రజలు సహకరించాలని మున్సిపల్ కమిషనర్ శాంతికుమార్ కోరారు. మున్సిపల్ కార్యాలయం ఆవరణలో అధికారులు గురువారం స్వచ్ఛ దివాళీ, శుభ్ దివాళీ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలు కాలుష్యం బారిన పడకుండా ప్రమిదల్లో దీపాలు వెలిగించాలన్నారు. అనంతరం స్థానిక మహిళలకు ప్రమిదలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ ప్రశాంత్‌కుమార్, మెప్మా డీఎంసీ శ్రీవాణి, ఏడీఎంసీ మానస, రవీందర్, అంజయ్య, శ్రీధర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.